విశాలాంధ్ర
అనకాపల్లి
పేజి నెం. 6
శుక్రవారం 4, ఏప్రిల్ 2025

ఈనెల 7న రోలుగుంటలో సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-రోలుగుంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 7వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీడీవో ఎస్.నాగేశ్వరరావు గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. జరగనున్న సర్వసభ్య సమావేశంలో మండలంలో గల అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు మరియు ఆయా శాఖల మండల అధికారులు సోమవారం ఉదయం 11 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

లక్ష్యానికి మించి ఉపాధి కల్పన

- నిర్దేశించిన లక్ష్యం 120 లక్షల పని దినాలు, సాధించిన లక్ష్యం 124.67 లక్షల పని దినాలు

- రోడ్డు సదుపాయాలు లేని 17 గిరిజన ఆవాసాలకు రూ.21.89 కోట్లతో 22.18 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి/ కలెక్టరేట్ : 2024-25 ఆర్థిక సంవత్సరంలో అనకాపల్లి జిల్లాలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్దేశించిన 120 లక్షల పని దినాల లక్ష్యాన్ని అధిగమించి 124.67 లక్షల పని దినాలను కల్పించడం ద్వారా రాష్ట్రంలో ఆరవస్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. జిల్లాలో 124.67 లక్షల పని దినాలను కల్పించడం ద్వారా ఉపాధి హామీ కూలీలు 350 కోట్ల రూపాయలు వేతనాల రూపంలో లబ్దిపొందారని, కూలీలకు సగటు రోజువారీ వేతనంగా 281 రూపాయలు చెల్లించి రాష్ట్రంలో నాలుగవ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బంది, వివిధశాఖల అధికారులను అభినందించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అనకాపల్లి జిల్లాలో 2024-25 సంవత్సరంలో అభివృద్ధి, ఉపాధి కల్పన, మరియు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాల్లో సాధించిన ప్రగతిని తెలియజేస్తూ, మెరుగైన పనితీరుతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 127 లక్షల పని దినాలలక్ష్యంను అధిగమించి మొదటి స్థానంలో నిలిచేందుకు కృషిచేయాలని ఉపాధిహామీ పథకం అధికారులకు జిల్లా కలెక్టరు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఖర్చు 516.65 కోట్లు వ్యయం చేయగా దానిలో వేతనం ఖర్చు 350.29 కోట్లు, మెటీరియల్ ఖర్చు 154.79 కోట్లు, అడ్మినిస్ట్రేషను వ్యయం 11.57 కోట్లు వ్యయం చేసారు. కూలీలకు సగటు రోజువారీ వేతనంగా 281 రూపాయలు చెల్లించి రాష్ట్రంలో నాలుగవ స్థానంలో, కూలీలకు సగటున 59 రోజుల పని కల్పించి 5వ స్థానంలో, 124.67 కోట్ల పనిదినాలు కల్పించి 6వ స్థానంలో, 29,740 కుటుంబాలకు 100 రోజుల పని కల్పించి 5వ స్థానంలో, 74 శాతం రిజిస్టరు చేసుకొన్న జాబ్ కార్డు దారులకు పని కల్పించి 6వ స్థానంలో జిల్లా నిలిచింది.జిల్లాలో ఉపాధిహామీ పథకంలో భాగంగా 1648 రైతులకు చెందిన 1830 ఎకరాలలో పండ్ల తోటల పెంపకము చేపట్టడం ద్వారా లబ్ధిపొందారు. 120 ఎకరాల ప్రభుత్వ భూములలో కొబ్బరి మొక్కలు నాటడం జరిగింది.పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా 745 గోకులంషెడ్లు, రూ.181.22 కోట్లరూపాయలతో 229.09 కిలోమీటర్ల సి.సి. మరియు బిటిరోడ్లు నిర్మాణం, రూ.24.95 కోట్ల రూపాయలతో 308 పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం, 1.67 కోట్ల రూపాయలతో 89 నర్సరీలు, 13కోట్ల రూపాయలతో 44 పట్టుపరిశ్రమ పనులు మంజూరు చేయడం జరిగినది. రోడ్డుసదుపాయాలులేని 17 గిరిజన ఆవాసాలకు 21.89 కోట్ల రూపాయలతో 22.18 కిలోమీటర్ల రోడ్డును మంజూరు చేయడం జరిగినది.2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 127 లక్షల పని దినాలులక్ష్యంగా, వీటిలో ప్రాధాన్యత పనులైన పశువుల త్రాగే నీటి తొట్టెలు 215, పంట సంజీవని 7200, పంట కాలువల పునరుద్ధరణ 451.50 కిలోమీటర్లు, సాగునీటి పారుదల మెరుగుదల కోసం చెరువుల సమగ్ర అభివృద్ధి 977 పనులను మంజూరుచేసి, పనులన్నింటిని ఏప్రిల్ 1వ తేదీన ప్రారంభించి పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేయడం జరిగింది.

ఆర్ఇసిఎస్ కళాశాలలో ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర-కశింకోట : ఆర్ ఇ సి ఎస్ పాలిటెక్నిక్ కళాశాల కశింకోటలో గురువారం ఉచిత పాలీసెట్ శిక్షణా తరగతులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి .ఉమా శంకర్ ప్రారంభించారు. ఆర్ఇసిఎస్ పరిధిలోని వినియోగదారుల పిల్లలు మరియు జిల్లాలోని 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు అంతా ఈ అవకాశం ఉపయోగించు కోవచ్చని, శిక్షణకు వచ్చే ప్రతి విద్యార్థికి స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా ఇవ్వబడును అని, ఇంజనీరింగ్ కోర్సు చదవటానికి మరియు ఉద్యోగావకాశాలకు పాలిటెక్నిక్ విద్య చాలా ఉపయోగకరంగా ఉంటుంది అని, పాలిటెక్నిక్లో ఏ బ్రాంచ్ తీసుకోవాలి, ఉద్యోగావకాశాలు - స్కోప్ ఎలా ఉంటాయి వంటి అంశాలపై కెరీర్ కౌన్సెలింగ్ కూడా ఇవ్వబడుతుంది అని, పోలిసెట్ ఎంట్రన్స్ పరీక్షకు ఇంకా దరఖాస్తు చేయకపోతే, కళాశాలలో ఉచితంగా దరఖాస్తు చేయబడుతుంది అని, శిక్షణా తరగతులు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.00 వరకు నిర్వహింపబడతాయి అనితెలియచేసారు. ఈకార్యక్రమంలో అసోసియేట్ ప్రిన్సిపల్ కర్రి శివ , జనరల్ సెక్షన్ విభాగాధిపతి ఎస్. గణేష్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి పి. రమణ కుమార్ , సీనియర్ లెక్చరర్లు వై. వీరేంద్ర ఎం. జగదీష్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-సబ్బవరం : మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారులకు బ్యాంకర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు స్థానిక ఎంపీడీవో పి. పద్మజ తెలిపారు. అందులో భాగంగా మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు 892 మంది దరఖాస్తు చేసుకోగా 740 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఆమె తెలిపారు.మండలంలోని 24 పంచాయతీలు ఉండగా పంచాయతీల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. నరపాడు-1లో 16 మందికి 14 మంది, బోదువలస 49 కి 39 మంది, అయ్యన్నపాలెం 17 మందికి 14 మంది, ఎల్లుప్పి 28 కి 26 మంది, ఆరిపాక 43 కి 34 మంది,అంతకాపల్లి 54 కి 49 మంది, బంగారమ్మపాలెం 24 కి 20 మంది, అద్దూరు సిరసపల్లి ముగ్గురికి ముగ్గురు,గౌటివాడ 15 మందికి 13 మంది, అమృతపురం 29 కి 15 మంది, గొల్లలపాలెం 28 కి 25 మంది, ఆసకపల్లి 94 కి 85 మంది, సబ్బవరం 135 మందికి 111 మంది, పైడివాడ అగ్రహారం 50 కి 42 మంది,పైడివాడ 29కి 26 మంది, ఇరువాడ 33 కి 30 మంది, వంగలి 49 కి 40 మంది, టెక్కలిపాలెం 24 కి 19 మంది, రాయపుర అగ్రహారం 19కి 17 మంది, నల్లరేగులపాలెం 7 కి 7,నారపాడు 12 కి 9 మంది, మొగలిపురం 28 కి 9 మంది, గుల్లేపల్లి 71 కి 64 మంది హాజరైయినట్లు తెలిపారు. ఈ రుణాలకు సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు,కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకులకు చెందిన బ్యాంకర్లు పాల్గొని అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేసి దరఖాస్తులు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏవో కె .శివ నారాయణ ప్రసాద్, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

విశాలాంధ్ర-పాయకరావుపేట : గ్రామాలలో ప్రజలు తాగునీటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జయప్రకాశరావు ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రక్షిత మంచినీటి సరఫరా బ్యాంకుల్లో ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని, మురికి కాలువలు శుభ్రం చేయాలని, సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పాయకరావుపేట, మండలంలోని నామవరం గ్రామాల్లో తడి చెత్త పొడి చెత్త సేకరణపై ఈఓపిఆర్డి సిహెచ్. చంద్రశేఖర రావు ప్రజలకు అవగాహన కలిగించారు.

గ్రామాల్లో విద్యుత్‌లో వోల్టేజ్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పాయకరావుపేట : గ్రామాల్లో విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జయప్రకాశరావు విద్యుత్ అధికారులను కోరారు. గ్రామాల్లో విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలు ఉన్నట్లు ఇటీవల జరిగిన మండల పరిషత్ సమావేశంలో పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. విద్యుత్ లో వోల్టేజ్ సమస్యలు పరిష్కరించి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి సిహెచ్. చంద్రశేఖర రావు, సూపరిండెంట్ సి. హెచ్.ఆర్.కే. వర్మ, విద్యుత్ ఏఈలు యు.ఎమ్. రావు, పరదేశి, ఏపీవో నాని బాబు తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడు.. అడుగడుగునా ఛిద్రం!

అధికారుల పర్యవేక్షణ లోపంతో పెరిగిన రోడ్డు ప్రమాదాలు!

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : మండలానికి చేరువనున్న పక్క మండలమైన రావికమతం మండలానికి సంబంధించిన నల్లరాయి క్వారీల నుండి అధిక లోడుతో వెళుతున్న వాహనాల వలన రోడ్డు పూర్తిగా పాడైపోతున్నాయని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిమితికి మించి పిక్క, ఇసుక,రాయి వంటి తదితర సామాగ్రి తో నిత్యం పదుల సంఖ్యలో లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రోడ్డు త్వరగా పాడైపోతుందని గుంతల పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని అదుపు చేయాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినటువంటి వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని గూడ్స్ వాహనాల రద్దీ రోజురోజుకు పెరిగిపోతున్న సరే పర్యవేక్షణ లోపంతో అధిక లోడు మితిమీరిన వేగం కారణంగా నిత్యం ప్రమాదాల జరుగుతున్నాయని ఈ వాహనాల వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులకు ధూళి దుమ్ముతో అనేక రోగాలు వచ్చే అవకాశం ఉందని ఇకనైనా సంబంధించిన అధికారులు గూడ్స్ వాహనాలను కట్టడి చేయాలని పలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

భూసార పరీక్షా ఫలితాల ఆధారంగానే ఎరువుల వాడకం చేపట్టాలి

విశాలాంధ్ర-వి. మాడుగుల : మాడుగుల మండలం సాగరం, వీరనారాయణం గ్రామాలలో భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగంపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాబోయే తొలకరిలో పంటలు వేయబోయే రైతాంగం తప్పనిసరిగా మట్టి నమూనాలను సేకరించి దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా అనకాపల్లిలో ఉన్న మట్టి నమూనా పరీక్ష ప్రయోగాలకు పంపించి వారు ఇచ్చిన ఫలితాలు ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు రైతులకు సూచించారు. ప్రయోగశాల వారు ఇచ్చే సాయిల్ హెల్త్ కార్డు(ఎస్‌హెచ్‌సిలో ప్రధాన మూలకలు అయినటువంటి నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్, ఐరన్, బరాన్ వంటి సూక్ష్మ పోషకాలు కూడా ఏ స్థాయిలో ఉన్నాయో తెలియజేస్తే తదుపరి వేయబోయే పంటలకు ఏ ఎరువును ఎంత మోతాదులో వేయాలో తెలియజేయడం జరుగుతుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విధిగా మట్టి పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాలు ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టినట్లు అయితే పంటపై పెట్టే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాగరం గ్రామ నాయకులు కోట్ని సన్యాసినాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది లక్ష్మీ, రేణుకా, ఇరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కే కోటపాడు : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని పాతవలస దాలివలస సింగన్న దొరపాలెం ఏ కోడూరు గ్రామాల్లో కోటి అరవై లక్షల రూపాయలతో సిసి రోడ్లు వాటర్ ట్యాంక్ పశువుల నీటి తోట్టెలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాతవలస సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు వాణిజ్య పంటల సాగుకు ఆసక్తి చూపించాలన్నారు. రైతులకు కావలసిన అన్ని రకాల సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుంది అన్నారు. ఈ మండలం మెరక గ్రామాల నుండి విశాఖ నగరానికి 50 శాతం కూరగాయలు రవాణా అవుతున్నాయి అన్నారు. అలాగే జీడి మామిడి పామాయిల్ తదితర పంటలకు మూడు సంవత్సరాల వరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుంది అన్నారు. నియోజకవర్గంలో 90 శాతం రోడ్లు పూర్తయ్యాయి అన్నారు. ప్రధానమైన కొన్ని రోడ్లను డబుల్ రోడ్లు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ నిధులతో వ్యవసాయం చేయటానికి నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ నీటి కుంటల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో అనేక పరిశ్రమలు వస్తున్నాయని ప్రతిభ గల యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. గ్రామాల అభివృద్ధిపైనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పవన్ కళ్యాణ్ ఎక్కువగా దృష్టి సారిస్తున్నారని వచ్చే నాలుగేళ్లలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు పివిజి కుమార్ మండల దేశం పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్ పాతవలస సర్పంచ్ జామి శ్రవణ్ పూడి నారాయణమూర్తి దాడి ఎరుకనాయుడు సబ్బవరపు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొన్న ప్రమాదంలో సెక్యూరిటీ గార్డ్ మృతి

విశాలాంధ్ర-కశింకోట : కారు ఢీకొన్న ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది ఈ సంఘటన సంబంధించి సిఐ అల్లు స్వామి నాయుడు గురువారం తెలిపిన వివరాలు బయ్యవరం గ్రామానికి చెందిన పెదపాటి వెంకట్రావు (52) అనకాపల్లి మండలం సంపత్ పురం వద్ద కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. యధావిధిగా రోజు మాదిరిగా విధులకు వెళ్లేందుకు సైకిల్ పై ఇంటి నుంచి బుధవారం రాత్రి బయలుదేరాడు. నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది ఈ ప్రమాదంలో వెంకట్రావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో అనకాపల్లి ప్రభుత్వాసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు. మృతుడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉపాధి హామీ పథకం వేతన జీవులకు ఎంతో మేలైనది

విశాలాంధ్ర-యలమంచిలి : మండలంలోని రేగుపాలెం గ్రామంలో గురువారం గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అన్న బాబ్జి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతన జీవులకు ఎంతో మేలైన పథకముగా మలిచాయని అన్నారు. ఒక కుటుంబానికి వంద రోజులు పని కల్పిస్తారని, ఇటీవలే గరిష్టంగా రోజుకు వేతనం 307 వరకు పెంచారని తెలిపారు. పూర్తిస్థాయిలో వేతనం పొందేలా పనిచేసి గరిష్ట వేతనం పొందాలని, వేసవిలో వడదెబ్బ కు గురికాకుండా వేగరమే పనికొచ్చి తొందరగా పని పూర్తి చేసుకోవాలని అన్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ఇంతటి మండు వేసవిలో డిహైడ్రేషన్ కాకుండా మంచినీళ్లు అందుబాటులో ఉంచుకొని ప్రభుత్వ ఉచితంగా ఇస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లను వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి లాలం స్వామి నాయుడు, బిజెపి జిల్లా కార్యదర్శి కొల్లి సత్య నారాయణ, జనసేన మండల నాయకులు మల్లిపాటి మహాలక్ష్మి నాయుడు, అనపర్తి రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ అచ్చినాయుడు, ఎన్నేటి రమణలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిర్వహించిన గ్రీవెన్స్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట : చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు సంక్షేమమే ధ్యేయంగా, చోడవరం అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. బుచ్చయ్యపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రజా వేదికలో ఎమ్మెల్యే నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మండలం నుండి ప్రజానీకం, వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యల అర్జీలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో వెను వెంటనే చర్చించి పరిష్కారం చూపించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకున్నారు. మండలంలో గల ప్రజలు పెద్ద ఎత్తున అర్జీలు ఇచ్చేందుకు తరలివచ్చారు. ఇందులో ప్రముఖంగా రెవిన్యూ, వాటర్, ఎన్. ఆర్. జి.ఎస్, కరెంట్ సమస్యలపై పెద్ద స్థాయిలో అర్జీలు రాగా అందులో చాలా వరకు ఎమ్మెల్యే అక్కడే ఉన్న అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపారు. ఎప్పటి నుండే సమస్యల జాడ్యంతో మూలుగుతున్న మండల ప్రజలకు చర్యలతో ఉపశమనం పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. అర్జీలలో మిగిలిన వాటి బాధ్యత తమదని హామీ ఇచ్చారు.సమస్యల పరిష్కారానికి సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు గేదెల సత్యనారాయణ, వియ్యపు అప్పారావు, ఎంవివి సత్యనారాయణ, దొండా నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధిపై వెలుగు సిబ్బందికి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-యస్.రాయవరం : గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు స్వయం జీవన ఉపాధి పెరిగే విధంగా అవగాహన కలిగించేందుకు మండల మహిళా సమైక్య సిఏలు వివో ఏ లకు అవగాహన కల్పించారు. 2025- 26 సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాలు సభ్యులకు ఉపాధి పై ఏ విధంగా అవగాహన ఏవిధంగా కల్పించాలని వీడియో రూపంలోని శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది , యానిమేటర్ ,సు వివోఎ, సీసీలు ,మహిళా సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బైకు ర్యాష్ డ్రైవింగ్‌ను నియంత్రించాలి

విశాలాంధ్ర-మాకవరపాలెం : బైక్ ర్యాష్ డ్రైవింగ్ ను నియంత్రించాలని భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిషోర్ డిమాండ్ చేశారు. అవంతి కళాశాల ఎదురుగా బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమబోయినపాలెం గ్రామానికి చెందిన లాలం మణిబాబు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం సర్పంచ్ కిషోర్ ప్రెష్ మీట్ . ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవంతి కాలేజీ విద్యార్థులు ఓవర్ డ్రింకింగ్ చేసి రాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపైన ప్రయాణం చేసే ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వీరు చేస్తున్న ప్రమాదాల కారణంగా ఎంతోమంది అవయవాలు కోల్పోవడమెగాక, కొంతమంది మృత్యువాత పడుతున్నారన్నారు. అయినా కాలేజీ యాజమాన్యం నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తున్న తీరు చాలా బాధాకరమన్నారు. ఈ విషయంపై కాలేజీ యాజమాన్యంకు అనేక సార్లు తెలియపరిచిన ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. వీళ్ళ కాలేజీ స్టూడెంట్స్ ఓవర్ డ్రింకింగ్ చేసి ట్రిబుల్ డ్రైవింగ్ చేస్తూ బుధవారం రాత్రి లాలం మణిబాబు మరణానికి, అతడి మనవడు హర్ష(5) బాబు కాలు విరిగిపోవడానికి కారణం అయ్యారన్నారు. ఈరోజు ఆ మరణించిన వ్యక్తికి ఇద్దరు ఆడపిల్లలు ఆ యొక్క కుటుంబం బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు . ఇప్పటికైనా యాజమాన్యం, పోలీసులు ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి అన్యాయం మరే కుటుంబానికి జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

అంబులెన్స్ ఏర్పాటు కోసం రూ.35 లక్షలు అందజేత



విశాలాంధ్ర - పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక సదుపాయాలతో కూడిన అంబులెన్స్ ఏర్పాటు కోసం సంస్థ రూ.35 లక్షలు ఇచ్చింది. ఈ నగదుకు సంబంధించిన చెక్కును సింహాద్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ చేతుల మీదుగా గురువారం జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ సిఎస్ఆర్ సేవలను కలెక్టర్ ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని కోరారు. సమీర్ శర్మ మాట్లాడుతూ ఆరోగ్యం, పరిశుభ్రత మెరుగుదలకు కృషి చేస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఇందుకోసం మొబైల్ హెల్త్ యూనిట్లు ఏర్పాటు చేసి గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. 2020 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 29 గ్రామాల్లో 75 వేలకు పైగా వైద్య సేవలు వినియోగించుకున్నారని చెప్పారు. ఇందులో ప్రత్యేక వైద్య శిబిరాలు, సమగ్ర కంటి పరీక్షా శిబిరాలు ఏర్పాటు చేసి 300 మంది కి పైగా కంటి శస్త్ర చికిత్సలు చేయించడం జరిగిందన్నారు. అలాగే 3000కు పైగా కళ్లద్దాలు అందజేశామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో మూలపేట గ్రామపంచాయతీ శివారు గంగాదేవి పేట గ్రామంలో పంచాయితీ 15వ ఆర్థిక సంఘం నిధులలో సుమారు 1,50,000 రూపాయలతో కాండ్రేగుల అన్నపూర్ణ ఇంటి దగ్గర నుంచి మొల్లేటి జగన్నాథరావు ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి గురువారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిశెట్టి గంగ అప్పలనాయుడుతో పాటు ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,గ్రామ ఉపసర్పంచ్ మొల్లేటి దేవి చంద్ర,వార్డు మెంబర్లు వాకపల్లి నూకాలమ్మ, ఆడారి సత్యనారాయణ,మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి శ్రీనివాసరావు, గంగాదేవి పేట విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షులు సమ్మెంగ భాస్కరరావు,కూటమి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎన్ఏఓబి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-యస్.రాయవరం : నేవిల్ బేస్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎఓబి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మనోరమ ను మత్స్యకారులు కొరారు .గురువారం మండలంలో వాకపాడు పంచాయతీ బంగారమ్మ పాలెం గ్రామంలో రెవెన్యూ అధికారులు మత్స్యకారులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ ...తమ సమస్యలు పరిష్కారం చేయకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .ముఖ్యంగా తమ పంచాయతీ వాకపాడు నుంచి ప్రత్యేకంగా రోడ్డు నిర్మాణం తో పాటు వంతెన నిర్మాణం చేపట్టాలని ,బంగారమ్మ పాలెం ను పంచాయతీ గా గుర్తించాలని , జెట్టి నిర్మాణం చేయాలని తమ డిమాండ్ల అధికారులు దృష్టికి తీసుకొచ్చారు నేవిల్ బేస్ లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. తదితర అంశాలపై చర్చించ అనంతరం మీ సమస్యలను పరిష్కరించే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్తామని రెవిన్యూ అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జె .రమేష్ బాబు ,సీఐ ఎల్. రామకృష్ణ ,ఎస్సై ఏ .విభూషణరావు ,సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు ,ఎంపీటీసీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు .

పోలవరం స్మశాన వాటికలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు

మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు భీమిరెడ్డి సత్యనారాయణ

విశాలాంధ్ర-గొలుగొండ : రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంజూరు చేయించిన పది లక్షల రూపాయల నిధులతో పోలవరం స్మశాన వాటిక అభివృద్ధి పనులు గురువారం తెలుగుదేశం పార్టీ నాయకులు భీమిరెడ్డి సత్యనారాయణ కామిరెడ్డి గోవిందు ప్రారంభించారు .గొలుగొండ మండలం చీడి బొమ్మల పంచాయతీ పోలవరం స్మశాన వాటికలో ఎటువంటి సౌకర్యాలు లేక దహన సంస్కార సమయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక చొరవతో ఈ నిధులను మంజూరు చేయించడం జరిగిందని వారు అన్నారు. పంచాయతీలో పెండింగ్ లో ఉన్న పనులు అన్నింటిని విడతల వారీగా అభివృద్ధి చేసిన స్పీకర్ అయ్యన్న కృతనిత్యంతో ఉన్నారని వారు ఈసందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చోద్యంలో 6.5 తులాల బంగారం చోరీ : ఎస్సై

విశాలాంధ్ర-గొలుగొండ : చోద్యం గ్రామానికి చెందిన బొందల రాజు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 6.5 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేయడం జరిగిందని కృష్ణ దేవి పేట వై తార్కేశ్వరరావు తెలిపారు. ఎస్సై అందించిన వివరాలు ఎలా ఉన్నాయి. గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి చెందిన బొందల రాజు కుటుంబ సభ్యులు ఈనెల 2బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో లింగంపేటలో జరిగే నూకాలమ్మ జాతరకు వెళ్లి రాత్రి 12:30 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న 6.5 తులాల బంగారాన్ని దోచుకెళ్ళారన్నారు.ఈ కేసు పై ప్రత్యేకంగా నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాస్ నర్సీపట్నం రూరల్ సిఐ రేవతమ్మ ఎస్సై తారకేశ్వరరావు ఆధ్వర్యంలో దొంగతనం జరిగిన ప్రాంతాన్ని క్లూస్ టీం తో సందర్శించి ఆధారాలను సేకరించడం జరిగిందని తెలిపారు.

విశాలాంధ్ర అనకాపల్లి
పేజి:
శుక్రవారం 4, ఏప్రిల్ 2025

నూకాలమ్మ అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే సుందరపు

విశాలాంధ్ర-అచ్యుతాపురం : ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అనకాపల్లిలో గురువారం శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు . ఆలయ కమిటీ వారు ఆహ్వానించి , వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు . అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు . ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు .

అన్నసమారాధన

విశాలాంధ్ర-మునగపాక : మండలంలో చూచుకొండ గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ 10వేలు రూపాయలు విరాళం ఆలయ కమిటీకి అందజేశారు. ఈకార్యక్రమంలో హరే రాము,అప్పలనాయుడు,గ్రామ యువకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రక్షిత మంచినీరు అందించాలి

ఉపాధిహామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

సచివాలయ సిబ్బంది హాజరు నమోదు తప్పనిసరి

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : ఉపాధి హామీ అధికారులు, గ్రామీణ నీటిసరఫరా అదికారులు, విద్యుత్ శాఖ అధికారులు వేసవిలో ఉపాధి, మంచినీరు, విద్యుత్ అంశాలలో ప్రజలకు యిబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయం సమావేశ మందిరం నుండి జిల్లా అధికారులు మండల అభివృద్ధి అధికారులతో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపడుతున్న సర్వేలు, ఎస్. డబ్యు.పి.సి. షెడ్లు, హౌసింగు, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధిహామీ, చలివేంద్రాలు ఏర్పాటు అంశాలపై జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది నూరుశాతం హాజరు నమోదుకావాలని, హాజరు వివరాలను పంపించాలని మండల అభివృద్ధి అధికారులను ఆదేశించారు. విధులలో నిర్లక్ష్యం వహించే సచివాలయ సిబ్బందిపై క్రమశిక్షణచర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న సర్వేలన్నింటిని వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. పుట్టిన ప్రతి చిన్నారికి ఆధార్ కార్డు అందజేయాలని, పి.ఎ.సి.ఎస్. ఇ కెవైసీ పూర్తిచేయాలని తెలిపారు. గ్రామ సెక్రటరీ వారిగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించిన విరాలను తెలియజేయాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా పూర్తిచేసిన రహదారులను ప్రారంబోత్సవం చేయాలని తెలిపారు. ఉపాధికూలీలకు మంచినీరు అందుబాటుల ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గామాలలో పారిశుద్యంపై ప్రత్యేక శ్రద్ద వహించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ఎస్.డబ్యు.పి.సి. షెడ్లు నూరు శాతం వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. పారిశుధ్యంపై ఇఒఆర్ డి లు బాద్యత తీసుకోవాలని, స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో బాగంగా చేపడుతున్న కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, ప్రతిరోజు పారిశుద్యపనులను పర్యవేక్షణచేయాలని తెలిపారు. అవసరమైన క్లాప్ మిత్ర సిబ్బందిని నియమించుకోవాలని, శనివారం నాటికి పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలన్నారు. వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. జిల్లాలో మంచినీటి ఎద్దడి రాకుండా కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకొని, చర్యలు తీసుకోవాలని తెలిపారు. బోర్లు మరమ్మత్తులు వెంటనే చేయాలని, మంచినీటి సరఫరాలో యిబ్బందులు వస్తే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. నిర్దేశించిన మోతాదులో ప్రతి కుటుంబానికి శుద్దిచేసిన రక్షితమంచినీరు అందించాలని ఆదేశించారు. జిల్లాలో 500 పశువుల నీటి తొట్టిలను మంజూరు చేయడం జరిగిందని, వాటి నిర్మాణాలు పూర్తిచేసి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. గిరిశిఖర గ్రామాలలో మంచినీటికి యిబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని, మంజూరుచేసిన పనులు పూర్తిచేయాలని తెలిపారు. ఒకటి,రెండు కుటుంబాలే గల గ్రామాల ప్రజలను దగ్గరలో గల గ్రామాలలో వసతి

కల్పించాలని తెలిపారు. హౌసింగుకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న అదనపు సహాయం లబ్దిదారుల ఖాతాలలో జమచేయడం జరిగిందని, లబ్దిదారులకు అపగాహన కల్పించి వెంటనే ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని తెలిపారు. స్టేజి వారీపురోగతి సాదించాలని, జిల్లాలో జూన్ నాటికి 7200 ఇండ్లను పూర్తిచేయాన్నారు. వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఒక చలివేంద్రం, ఏర్పాటుచేయాలని, అవసరమైనచోట్ల అదనంగా ఏర్పాటుచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సి.ఇ.ఒ. పి.నారాయణమూర్తి, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు వై.శ్రీనివాసరావు, గ్రామీణ నీటిసరఫరా జిల్లా ఇంజనీరింగు అధికారి ఎ.ఎస్.ఎ. రామస్వామి, జిల్లా పంచాయతీ అధికారి పి.శిరీషారాణి, డిపిఆర్సి జిల్లా కోర్డినేటరు ఇ.నాగలక్ష్మి , మండల అభివృద్ధి అధికారులు, ఇ ఒ ఆర్ డి లు, మండల ఇంజనీర్లు పాల్గొన్నారు.

బస్సు స్టాప్ లపై కానరాని పర్యవేక్షణ!౦ ప్రమాదం అంచున పలు బస్టాపులు

బుచ్చయ్యపేట విశాలాంధ్ర న్యూస్: సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాపుల తీరు నేడు ఏ క్షణాన కూలుతాయో చెప్పలేని విధంగా తయారయింది మండలంలోని కొన్ని బస్ స్టాప్ ల పరిస్థితి మరింత దీనంగా ఉంది. భీమిలి శాసనసభ్యులు గంట శ్రీనివాసరావు చోడవరం శాసనసభ్యులుగా ఉన్న సమయంలో నిర్మించిన బస్టాప్ లు నేడు కూలిపోయే స్థితిలో ఉన్నాయని అసలే ఎండాకాలం కావడం మధ్యాహ్నం సమయంలో ప్రయాణికులు సేద తీరడానికి కాసేపు నిలబడాలన్న సరే ప్రాణాలు అరచేతిలో పెట్టుకునే పరిస్థితి రావడంతో బిక్కు బిక్కు మంటూ ఉంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్నిచోట్ల నిరుపయోగంగా పడి అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మరి కొన్నిచోట్ల బస్ స్టాపులు వాణిజ్య కేంద్రాలుగా ఆక్రమణకు గురవుతున్న సరే సంబంధించిన అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం తగదని ప్రభుత్వ భవనాలను పర్యవేక్షించి నూతన బస్టాప్లు నిర్మించాలని పలు ప్రజా సంఘాలు కోరుకుంటున్నాయి.

మూడోసారి వైసిపి మండల పార్టీ అధ్యక్షులుగా దేశంశెట్టి శంకరరావు

విశాలాంధ్ర-అచ్యుతాపురం : వైసిపి మండల అధ్యక్షులుగా దేశంశెట్టి శంకరరావు మూడోసారి ఎంపికయ్యారు . ఈ సందర్భంగా దేశంశెట్టి శంకరావు మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి మండల వైసీపీ అధ్యక్షులుగా మూడో సారీ ఎంపిక చేసిన మాజీ సీఎం జగన్ , మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు , జిల్లా పార్టీ అధ్యక్షులు భూడి ముత్యాలునాయుడు , అనకాపల్లి పార్లమెంట్ ఇంచార్జి కర్ణం ధర్మ శ్రీ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు . రాబోయే రోజులులో మండల వైసీపీ నాయకులు , కార్యకర్తలు సహకారంతో పార్టీనీ మరింత బలోపేతం చేస్తానన్నారు . మూడోసారి వైసిపి మండల పార్టీ అధ్యక్షులుగా ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు .

ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో పి ఆర్ టీ యు ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించే పాలిటెక్నిక్ శిక్షణ సంబంధించి కరపత్రం ను జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఎస్. రాయవరం మండలంలోని పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5వ తేదీ నుండి ఈ శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు .ఈ శిక్షణ ఇవ్వడం వల్ల గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత అవడం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వరరావు ,సంఘం నాయకులు భద్రరావు ,ఎమ్మెస్ రాజా, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కోవెల రమణ తదితరులు పాల్గొన్నారు.

మూలపేట,గవర్ల అనకాపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభం

- పనులు ప్రారంభించిన మండల టీడీపీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు

విశాలాంధ్ర -మునగపాక:మండలంలో మూలపేట,గవర్ల అనకాపల్లి గ్రామాలలో యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం ఉపాధి హామీ పనులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు,జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ కలిసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలమరశెట్టి మురళి,దొడ్డి రమేష్,కాళ్ళ చంద్రమోహన్,దాడి వీర మహాలక్ష్మి నాయుడు,జెకె నాయుడు,ఆడారి జనార్ధన్ మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు,కాండ్రేగుల గాంధీ,కొలుసు వెంకట అప్పారావు, సాంబశివ,పెంటకోట మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నూకాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న గండి రవికుమార్

విశాలాంధ్ర-సబ్బవరం: పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజపాలెం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయం విగ్రహ ప్రతిష్ట ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ నాయకులు గండి రవికుమార్ పాల్గొని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలు అందరిపై ఉండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఆయనతో పాటు వైస్సార్సీపీ నాయకులు పేరూరి చినబాబు , వానమాల నూకరాజు , ఎడ్ల నాయుడు, సిరపరపు వాసు ఆలయం కమిటీ సభ్యులు , గండి రవికుమార్ యువసైన్యం ఉన్నారు.